

చింతల్ వెంకట్రామిరెడ్డినగర్‌లో నేలకొరిగిన చెట్టు



కొంపల్లి జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం..




కొంపల్లి సినీ ప్లానెట్ వద్ద..

పొద్దంతా భగభగ..
సాయంత్రం చిటపట

భానుడి భగభగ నుంచి వరుణుడి చిటపటలతో ప్రజలు ఉపశమనం పొందారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షంతో జనజీవనం స్తంభించింది. కురిసిన అకాల వర్షానికి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లడంతో దుర్వాసన వెదజల్లింది. – సుభాష్‌నగర్



దూలపల్లిలోని దుర్గా కాలనీలో..



దూలపల్లిలో విద్యుత్ స్తంభం నుంచి ఎగిసిపడుతున్న మంటలు..

మిగిలింది మూడు రోజులే..

ఆ తర్వాత ఎన్నికలే.!

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం
- జోరుగా బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం
- 13న ఈవీఎంలలో నిక్షిప్తం కానున్న అభ్యర్థుల భవితవ్యం



సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా రోడ్‌షోలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

కుత్బుల్లాపూర్: మరో మూడు రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. తాము గతంలో చేసిన అభివృద్ధిని... తమను గెలిపిస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులను ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి అధికార కాంగ్రెస్ నుంచి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు.

◆ వీరికి మద్దతుగా ఇప్పటికే ఆయా పార్టీల అగ్రనేతలు ప్రచారం నిర్వహించగా విజయంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ తమ అంచనాలతో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి.... బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు రోడ్‌షోలు నిర్వహించి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈనెల 13న జరిగే ఓటింగ్‌లో ప్రధాన పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు.

ఆరు గ్యారంటీల హామీతో కాంగ్రెస్...

◆ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు విషయంపై కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా హామీ ఇస్తూ ప్రజల్లోకి తమకు ఓటు వేయాలని కోరుతూ ముందుకు సాగుతుండగా.. ఇప్పటికే ఐదు గ్యారంటీలు పూర్తిచేసి ఆరో గ్యారంటీ ఎన్నికల తర్వాత పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్ షో ద్వారా మైలేజ్ వస్తుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో సునీతామహేందర్‌రెడ్డి దూసుకుపోతుండగా ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన కూన శ్రీశైలంగౌడ్‌రాకతో ఆ పార్టీ బలపడిందని చెప్పుకోవచ్చు.

◆ ఇప్పటికే ఇన్‌చార్జిగా కొనసాగుతున్న హన్మంత్‌రెడ్డితో పాటు భూపతిరెడ్డి సైతం ఎన్నికల్లో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. నాలుగు నెలల వ్యవధిలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తూ ప్రజలను ఆకట్టుకునే పనిలో ఉండగా అధికార పార్టీపై ప్రతిపక్షాలు ఎప్పటికప్పుడు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటేస్తే తప్పకుండా మల్కాజిగిరి అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు.



ఈటల రాజేందర్‌కు మద్దతుగా రోడ్‌షోలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి (ఫైల్)

ప్రధాని మోదీ చరిష్మాతో ముందుకు..

◆ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా ఉన్న ఈటల రాజేందర్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తూ వస్తున్నప్పటికీ ఇక్కడ ప్రధాని మోదీ చరిష్మాతో ప్రజలు ఆ పార్టీపై మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికార, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఈటల రాజేందర్ స్థానికేతరుడు అంటూ ప్రచారం చేసినప్పటికీ గత రెండు నెలలుగా ప్రజల మధ్యనే ఉంటూ తనకు ఓటు వేయాలని కోరుతూ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీలో తిరుగుతూ బీజేపీని గెలిపించాలని కోరుతున్నారు.

◆ ప్రగతినగర్‌లో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిల రోడ్‌షోలు విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డి కుమారుడు చెరుకుపల్లి భరత సింహారెడ్డి బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు. అదే విధంగా సీనియర్ నాయకులు సైతం ఈటలకు మద్దతుగా ప్రచారం చేస్తున్నప్పటికీ.. నాయకులు వచ్చిన సమయంలోనే హడావిడి చేసి తర్వాత ప్రజలకు ముఖం చాటేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

చేసిన అభివృద్ధి గెలిపిస్తుందన్న ఆశతో బీఆర్‌ఎస్

◆ అభివృద్ధి పనులే తమకు విజయాన్ని చేకూరుస్తాయని ఆశాభావంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ముందుకు సాగుతున్నారు.ఈ నేపథ్యంలో ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భారీ బహిరంగ సభ ద్వారా సందేశాన్ని ప్రజలకు వివరించారు. స్థానికంగా ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రజలకు అందుబాటులో ఉన్నారని, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ముగ్గురు ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారన్నారు.

◆ షాపూర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరో ఐదు రోజుల్లో ఎన్నికల తంతు ముగిసే నేపథ్యంలో ప్రజల్లో చేర్చుకునే విధంగా కార్యకర్తలు, నాయకులు వెళ్లి ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. మెజార్టీ కార్పొరేటర్లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు కావడంతో స్థానికంగా ప్రచారానికి ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఏది ఏమైనా ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాతకాలు ముడిపడి ఉన్నాయి.



రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని రోడ్‌షో నిర్వహించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఫైల్)

మగ్గపెట్టిన మామిడి విషంతో సమానం

కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి

పంజగుట్ట: మోతాదుకు మించి రసాయనాలను ఉపయోగించి మామిడి పండ్లను మగ్గపెడుతున్నారని, ఇవి విషంతో సమానమని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు వచ్చిన ఫిర్యాదు మేరకు బాటసింగారం పండ్ల మార్కెట్‌ను సందర్శించామని, అక్కడ పండ్లు మగ్గపెట్టే తీరు చూసి అవాక్కైనట్లు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రసాయనాలు వినియోగిస్తూ కృత్రిమ పద్ధతిలో వ్యాపారులు పండ్లను మగ్గపెడుతున్నారని ఆరోపించారు. ప్రమాణాల ప్రకారం 10 కిలోల మామిడి పండ్లు మగ్గపెట్టేందుకు ఇథోఫిన్ ఒక్క చిన్న ప్యాకెట్ వాడాలని, అది కూడా పండ్లపై కాకుండా ప్రత్యేక బాక్స్‌లో పెట్టాలని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమపైనే వ్యాపారులు దాడులకు దిగుతున్నారని, వారు ఇంతకు తెగిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఆ మామిడి పండ్లు చిన్నపిల్లలు తింటే క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిపై మార్కెట్ కమిటీ ఉన్నతాధికారులకు, ఫుడ్ సెక్యూరిటీ అధికారులకు ఫిర్యాదు చెయ్యడమే కాకుండా చెక్ పోస్టులవద్ద వాహనాలు ఆపి మగ్గపెట్టిన పండ్లు బయటకు రాకుండా చేస్తామని హెచ్చరించారు.

కొలంబోలో అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలు

లక్డీకాపూల్: అంతర్జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన లింగంనేని మారుతి శంకర్ గోల్డ్, సిల్వర్ మెడల్లనున కైవసం చేసుకున్నారు. శ్రీలంకలోని కొలంబో వేదికగా ఈ నెల 4న స్విమ్మింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొన్న నగరానికి చెందిన పెవెస్ సీస్ ఎంటర్‌ప్రైస్‌మెంట్ అధినేత మారుతి శంకర్ ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్లను సాధించారు. బ్రెస్ట్‌స్ట్రోక్ విభాగంలో సైతం రెండు సిల్వర్ మెడల్లను సొంతం చేసుకున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా విజేతగా నిలిచిన మారుతి శంకర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

కళాసిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన షురూ

మోతీనగర్: మోతీనగర్ క్రాస్ రోడ్డులో కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఏడు రోజుల మాత్రమే ఉంటుందని నిర్వాహకులు వినోద్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లో భారతదేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టెన్లు, జైపురి స్టోన్ జువెలరీ పెరల్స్, ఉడన్ హ్యాండీ క్రాఫ్ట్స్, బంజారా, కోల్‌కత్తా బ్యాగులు, ఒరిస్సా పెయింటింగ్ హ్యాండిక్రాఫ్ట్స్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. మొట్టమొదటిసారిగా 65శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ వృద్ధుడికి బెదిరింపు

రూ.91 లక్షలు వసూలు చేసిన కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 74 ఏళ్ల వ్యక్తికి ఫెడెక్స్ కొరియర్ నుంచి కాల్ వచ్చింది. అతని ఆధార్‌కార్డు నంబర్ ద్వారా పంపించిన పార్శిల్‌లో 140 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తోపాటు ఐదు పాస్‌పోర్టులు, బ్యాంకు క్రెడిట్ కార్డులు, 4 కిలోల దుస్తులు, ల్యాప్‌టాప్ ఉన్నాయని చెప్పారు. ఈ విషయంపై ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారని భయపెట్టారు. అనంతరం బాధితుడికి స్కైప్ ద్వారా సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి.. 'మీరు డ్రగ్స్ సరఫరా, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారు'అని బెదిరించారు. నకిలీ సీబీఐ లేఖ చూపించి, అన్ని బ్యాంక్ అకౌంట్ల వివరాలు చెప్పాలని, నిబంధనల ప్రకారం వాటిని వెరిఫై చేస్తామని చెప్పి, ఆ బాధితుడి బ్యాంక్ ఖాతాలలో ఉన్న మొత్తం నగదు రూ.91,64,800 కాజేశారు. దీంతో బాధిత వృద్ధుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి



ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో నాలుగు నెలల కాంగ్రెస్ పాలన, కేంద్రంలో పదేళ్ల బీజేపీ దోపిడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే దాకా కార్యకర్తలు నడుం బిగించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఏడు డివిజన్లల్లో ఈనెల 13న జరిగే ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ జగద్గిరిగుట్ట, గాజులరామారం, రంగారెడ్డి నగర్, చింతల్, సూరారం, కుత్బుల్లాపూర్ డివిజన్లల్లో స్థానిక కార్పొరేటర్లతో పాటు ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.

◆ రాబోయే ఐదు రోజులపాటు అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో తనను అసెంబ్లీకి మూడోసారి పంపారన్నారు. ఎమ్మెల్సీగా శంభీపూర్ రాజు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని... రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ముగ్గురం కలిసి ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు అవుతామని స్పష్టం చేశారు.

◆ పదేళ్లపాటు దేశాన్ని బీజేపీ పాలిస్తూ మతతత్వ రాజకీయాలను పెంచిపోషిస్తుందని గుర్తు చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలుగా రాష్ట్రంలో ప్రజలను మోసం చేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని కార్యకర్తలను సూచించారు. సమావేశాల్లో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, విజయ్ శేఖర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

మాదిగలకు మందకృష్ణ మోసం

దళిత సంఘాల నేతల ఆరోపణ

హిమాయత్‌నగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని మోసం చేస్తూ, ఇప్పుడు తన స్వార్థం కోసం మతతత్వ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పలువురు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. మంద కృష్ణ చెపితే మాదిగలు వినే పరిస్థితి లేదని, అవసరమైతే ఆయన్ని మాదిగజాతి నుంచి బహిష్కరిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్.ఆర్.మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణను ఎందుకు చేయలేదో కృష్ణమాదిగ సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని, అందుకే మాదిగ జాతి ఇండియా కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడు సి.వి.ప్రసాద్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీహరి పాల్గొన్నారు.

అల్లూరి సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: మహనీయుల త్యాగాల వల్లే స్వాతంత్య్రం సిద్ధించిందని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకటరాజేశ్వరరావు అన్నారు.స్వాతంత్య్ర సంగ్రామంలో అల్లూరి నిర్వహించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అణచివేత, దోపిడీకి గురవుతున్న ప్రజలను సంఘటితం చేసి బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా సీతారామరాజు పోరాటం చేశారని కొనియాడారు. శ్రీనివాసరావు, సంకీర్త పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్లా



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రియాంక శుక్లా

కుత్బుల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్లా అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గురుమూర్తినగర్, నిజాంపేటలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదే విధంగా లయోల కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి.నర్సింహులు, కుత్బుల్లాపూర్, గండిమైసమ్మ, బాచుపల్లి తహసీల్దార్లు పాల్గొన్నారు.

సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీజేఎస్ సంయుక్త సమావేశం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లు రద్దు అవుతాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, తెలంగాణ జన సమితి పార్టీలు షాపూర్‌నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి లతో కలిసి శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. సునీతామహేందర్‌రెడ్డికి సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీల మద్దతును స్వాగతించారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... పదేళ్లపాటు కేసీఆర్ దుర్మార్గాలు, అరాచకాలను ఎండగట్టి ప్రజల తరఫున పోరాటం చేస్తే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. పదేళ్లలో తెలంగాణకు ఒక్క కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇవ్వలేదని... కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు హెచ్ఎంటీ, హెచ్ఏఎల్, ప్రాగా టూల్స్, ఇక్రిశాట్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేసిందన్నారు.

◆ నరేంద్ర మోదీ ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వంద రోజుల్లోనే ముప్పై వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టారని గుర్తు చేశారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో సునీతా మహేందర్‌రెడ్డికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

నిలిచిన టిప్పర్... జామైన ట్రాఫిక్

సుభాష్‌నగర్: జీడిమెట్ల గ్రామం నుంచి షాపూర్‌నగర్ వెళ్లే పైపు లైన్ రోడ్డులో ఓ టిప్పర్ మరమ్మతుల కారణంగా రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. (ఏపీ28టీడీ0145) నంబర్ ఉన్న టిప్పర్ మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో 44వ జాతీయ రహదారి జీడిమెట్ల విలేజ్ నుంచి షాపూర్ నగర్ వైపు వెళ్తుంది. పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జి వద్ద మరమ్మతుల కారణంగా మధ్యలో ఆగిపోవడంతో వాహనాలు ఎక్కడికి అక్కడ గంటపాటు నిలిచిపోయాయి. అనంతరం ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని తరలించి ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.



పైపులైన్ రోడ్డు బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన టిప్పర్